

# ఒక చీకటి రాత్రి



భోజనం చేస్తున్నప్పుడు గొణుక్కున్నాం - రాత్రికి సిగరెట్లు లేవు ఎలాగా అని. ఎలాగా అని గొణుక్కోవడమయితే గొణుక్కున్నాం గాని ఇలాగా అని నిర్ణయించుకోడం మటుకు మా చేతకాలేదు.

చివరికి టీ. యస్. ఓ. గారు పడుకుందుకి పోయేవరకూ మాకు ఎలాగో ఉంది. రాత్రి తొమ్మిది గంటలయింది; అప్పటికి నాకూ రామక్రిష్ణారావుకీ మా అవసరాల గురించి చర్చించుకోడానికి సమయం దొరికింది. పరాయి వూరు వొచ్చాం. నేను యఫ్. ఎస్. ఓని. వాడు కేంపు క్లార్కు.

అవసరాలంటే మరేం లేవు; తెల్లారి మరో వూరు పోవలసి వచ్చినా, అథవా ఆవూళ్లోనే వున్నా సిగరెట్లు మొట్టమొదటి అవసరం. ఇక రెండోది - ఆకలికి ఆగలేనివాళ్లమూ, పల్లెటూళ్ల హోటళ్ళకి అలవాటుపడ్డ వాళ్ళమూ అవడంచేత పొద్దున్నే నాలుగిడ్డెన్లూ ఓ కప్పు కాఫీ; అనగా వీటికి డబ్బులు. ఒకటీ డబ్బులేకండా రాదు; మా ఇద్దరిలోనూ ఒకడి దగ్గిరా డబ్బులేదు.

లేపొద్దున్న అవసరానికేం గాని, ఇప్పుడు భోంచెయ్యగానే ఎలాగా అని భోంచేస్తున్నప్పుడు మేం బెంబేరు పడ్డమాట వాస్తవమే. కాని టీ. యస్ ఓ గారు భోజనం చేశాక ఏదో అర్జంటు వ్యవహారాలగురించి మాటాడుతూ కూచోబెట్టేయడంవల్ల తొమ్మిదింటివరకూ పస్తున్నాం.

సాయంకాలం నాలుగింటికి "పంతులు గారు" కంపెనీలో సిగరెట్లు పైకితియ్యడం వల్ల టీ యస్. ఓ. గారితోబాటు మాకూ చెరో టీ యిచ్చుకోవలసి వచ్చింది. రామక్రిష్ణారావు సగంలో కాస్త అవతలికి వెళ్లి దాన్ని ఆర్పి జాగర్తగా జేబులో దాచాడు. ఆ బాపతే యిప్పుడు ముట్టించాడు. మరి నేనప్పుడు మర్యాదాకోసం వాళ్లమధ్య నే ఉండిపోవడంవల్ల అలా చెయ్యలేకపోయాను. ఇప్పుడు ఏమీ లేదు. చికాగ్గావుంది. వెనవదిఅలవాటుపడ్డప్రాణం.

మేం ఉన్నది ఆవూరి ట్రావెలర్స్ బంగళా. టీ. యస్. ఓ గారు పక్కగదిలో నిద్రచెయ్యడానికి వెళ్లిపోయారు.

నేను నెమ్మదిగా లేచి అలమార్లు రెండింట్లోనూ ఎక్కడైనా "సీతారామ ప్రసాదాలు" గాని ఉంటాయేమోనని వెతకడం ప్రారంభించాను. పూర్వం కేంపుల కొచ్చినప్పుడు టీ. ఎస్. ఓ గారికి తెలియకుండా గదిలో హుస్కా కొడుతూ అకస్మాత్తుగా ఆయనొచ్చేసరికి గుబుక్కున నోట్లో వున్న సిగరెట్లని అలమారుల్లో పడేసే వాళ్లం. (మా టి. యస్. ఓగారు సిగరెట్ ద్వేషులే కాక తత్ స్నేహిత, తదిష్ట ద్వేషులు కూడాను; అలాంటప్పుడు ఆయన ఎదురుగా ధూమపానకరణం శ్రేయస్కరం కాదు; సాయంత్రం ఎందుకు కాల్చగలిగామంటే అది కంపెనీలో గనక—) అలా అలమారుల్లో పడవేయబడిన ముక్కల్ని "సీతారామ ప్రసాదాలు" అని పిలుస్తాం. ఆబాపతేమైనా మిగిలున్నాయేమో అని వెతికాను.

నా అదృష్టవశాత్తూ రెండు ముప్పావు ముక్కలూ ఒక అయిదూ బై ఆరోవొంతు సిగరెట్టూ దొరికాయి. కాని ఈ అదృష్టంలో విషాద మేమిటంటే ఆ మూడూ

నిజరు మార్కు వే. నేను వదిలినవి కావన్న మాట.

"ఆఖరికి నీ యెంగిలి గతైందిరా!" అన్నాను.

రామక్రిష్ణ "హాఁ! మన మంటే యేమిటను కున్నావోయ్!" అని నవ్వుతూ అగ్గిపెట్టె అందించాడు.

నేను "జై సీతారామ్!" అన్నాను "సిగరెట్టు" నోట్లో పెట్టుకునే ముందు.

రామక్రిష్ణ నవ్వాడు. "జై సీతారామ్" కాదురా, "సర్వం శ్రీ జగన్నాథం!" అన్నాడు.

"అంటే?"

"అంటే యేమిటి నీబుర్ర కాయ. నువ్వు కాల్చింది మళ్లీ నువ్వే తీస్తే జై సీతారామ్; నేను కాల్చింది తీస్తే శ్రీ జగన్నాథం!"

నేను మొదటి పఫ్ వొదిలి నవ్వాను.

ఇంకా సిగరెట్టు అయిపోలేదు; బయట ఒక మనిషి వచ్చిన అలికిడి అయింది. "ఎవరదీ?" అన్నాడు రామక్రిష్ణ.

గదిలోకి ఒక నడివయస్సులో వున్న నాయుడు ప్రవేశించాడు. లోపలికి వొచ్చీ రావడంతో కాలుస్తున్న చుట్ట ఆర్పి చెవిని పెట్టుకుని "దండాలు బాబయ్యా" అన్నాడు.

"ఏంవొచ్చావ్?" అన్నాడు రామకృష్ణ

"ఏటి నేదు బాబూ— ఉత్తినే నూసి పోదామని" అన్నాడు నాయుడు చిన్న నవ్వుతో.

"చెబుదూ!" అన్నాడు రామకృష్ణ.

వాడు సూటిగా చెప్పలేదు. "తొందరేటి బాబూ! ఆ డెక్కడికి పోతాదు, నక్షలు నాగ తను రుంటుంటే!!" అన్నాడు విలాసంగా నవ్వుతూ.

ఏదో కయ్యం తెచ్చాడనుకున్నాను. కొంచెం భయం వేసింది. నక్షు గాళ్లమే గాని నక్కల్లాగ లేము.

"ఏమిట్రా?" అన్నాడు రామకృష్ణ - సూటిగా చెప్పమన్నట్టు.

ఆ నాయుడు నెమ్మదిగా నాదగ్గిరకొచ్చాడు, నెమ్మదిగా "ఏటీ నేదు బాబయ్యా! పంతులు గోరు, పాలిగోడిసేత అత్తోరింటికి ఇయాల రేత్తిరి నాలుగుబత్తాలుపమ్మిస్తండు" అన్నాడు.

రామకృష్ణ నా వేపు ప్రశ్నార్థకంగా చూస్తున్నాడు.

"అయితే యేంటంటావు?" అన్నాను నేను నాయుడుతో.



"—సూత్తారేటి బాబూ: నాలుగు డబ్బులు ఒడ్డిచ్చినన్నా ఒడ్డిచ్చండి గవుర్మెంటోరికొప్పగించనన్నా వొప్పగించండి." అన్నాడు నాయుడు తొందరగా.

"ఏమిటంటాడురా?" అన్నాడు రామక్రిష్ణ.

"చెప్తానుండు-" అని నాయుడువేపు తిరిగి "సరే నవు పోరా!" అన్నాను.

వాడు బుర్రగోక్కుంటూ "బాబూ! ఒడ్డిచ్చేయ్యాల. నన్నో కంటనూడాలి బాబూ!" అన్నాడు. అని చిన్న నవ్వు వెలిగించాడు.

"సరేలే; నువ్వెళ్లు. మళ్లీ ఎప్పుడవుపిస్తావు?"

"పెందిలి—"

"కాదురా. బళ్ళెన్నిగంటలకి తోల్తారు?-"

"సకంరే తిరప్పుడు."

"అప్పుడో మాటు రా!"

"ఎందుకు బాబు?"

"మాతో రావూ?"

"-అమ్మయ్యో; తెల్లారి ఊళ్లో బతకొద్దా బాబు?"

"ఉత్తినే సాయానికి రా! నువు వాళ్లకి కనపడక్కర్లేదు. ఓపక్కని నిలబడుదుగాని."

"సంపేశినారు బాబూ." అని వాడు వెళ్లిపోయాడు.

"ఏమిట్రా నీ వుద్దేశం?" అన్నాడు రామక్రిష్ణ.

"రాత్రి దార్లో కాద్దాం. బళ్లు ఆపేద్దాం. నాలుగు డబ్బులు లంచం గుంజుకుని వొదిలేద్దాం." అన్నాను కూతుహ్రంగా.

వాడికి అర్థం కాలేదు. అర్థమయ్యేదాకా బోధపరిచాను. అనక లంచం పుచ్చుకోవడం నీతి గురించి నామీద ఓ ఉపన్యాసం విసిరాడు. నేను దానికి తగ్గట్టుగా నే మరో వుపన్యాసం తిరగ్గొట్టాను. దాని ఉద్దేశమేమిటంటే ఈ కలికాలంలో లంచం పుచ్చుకోనివాడు మూర్ఖుడనీ, ఈ డెమోక్రసీలో దేనికి స్వేచ్ఛ లేకపోయినా అన్యాయంగా డబ్బు గుంజుకుందుకి స్వేచ్ఛ వుందనీ, ఈ పరిస్థితుల్లో లంచం పుచ్చుకోకపోతే రేపు

సిగరెట్ల విషయంలో అయితే నేం, ఇడ్లీ కాఫీల విషయంలో అయితే నేం కటిక ఉపోషం ఉండవలసివస్తుందనీ. ఎలాగ యితే నేం వాడిని ఒప్పించాను.

రాత్రి పదకొండు పైగా ఆయ్యాక ఇందాకటి నాయిుడు వచ్చాడు. "బాబూ! అల్లు బయిలు దేరతన్రు.'' అన్నాడు.

"ఎన్ని బళ్లురా?''

"రెండు బాబయ్యా!''

రామక్రిష్ణగాడితో "ఒరే అబ్బీ! నువ్విలా బయల్దేరితే లాభంలేదు. కాకీ సూటు నా పెట్లోవుంది. తీసిస్తాను. అది వేసుకోవాలి అన్నాను.

ఇప్పుడెందుకా పటాటోపాలన్నీ? అన్నాడు వాడు, కాని నా వుద్దేశం వేరే వుంది. తత్ ప్రకారం వాడు సూటు వేసుకోవలసి ఉంది.

అయితే, కోటు లేని సూటు మాత్రమే వుంది. పోనీ ఇదిమాత్రం ఎంతగాదని అదే తొడిగించాను.

ఎంగిలి సిగరెట్లు కూడా లేవు. టార్చి పట్టుకున్నాను. ముగ్గురం బయలుదేరి రోడ్డు పట్టాం. ఊరికి మైలున్నర అవతల కోనేరొకటి ఉంది. ఆగట్టు మధ్య ఒక జువ్వి చెట్టుంది. నాయిుడు "నేను సెట్టెక్కిపోతాను బాబూ!'' అన్నాడు భయంగా.

సరిగ్గా పన్నెండింటికి రెండు బళ్లు వొస్తున్న చప్పుడు వినిపించింది. గాఢాంధకారం. ఏం కనిపించదు. టార్చి ఉపయోగించడానికి జంకుగా వుంది. తల పైకెత్తి "ఏంరా, ఏమిటా బళ్ల చప్పుడు?'' అన్నాను.

నాయిుడు చెట్టు మీద లేడు. అప్పుడే దిగి నా పక్కకొచ్చేశాడు. మెల్లిగా "అయ్యో బాబూ; గంటల బళ్లు, అల్లరయె." అన్నాడు. నేను హడావిడిగా "ఒరే రామక్రిష్ణా; ఇలాంటప్పుడు నువ్వు నాన్ కో ఆపరేషన్ పెట్టావంటే పికొక్క పేలదు.; నడ్డీ వాచిపోతుంది; ఊళ్ళో అందరికీ తెలిసిపోతుంది.? అన్నాను.

"ఏం చెయ్యమంటావురా?" అన్నాడు వాడు.

"ఈ రాతిమీద పోజుపెట్టి నుంచోవాలి. చేతులు రెండూ జేబుల్లో పెట్టాలి. నీ తస్సా చెక్కా అప్పుడే చొక్కా ఎంత బైటికి తీశావురా! సరిగా లోపలికి తొయ్. ఊఁ ఈ హేటు తగిలించు." అని వాణ్ణి సరిదిద్ది మేకప్ చేశాను.

"భేష్ అచ్చు మనం అనుకున్నట్టు వొచ్చింది. ఇప్పుడు నిన్ను చూసి టీ. యస్. ఓ అనుకోక పోయినవాడు పూలన్న మాట. రైట్; అలాగే నిలబడు. పోజు చెదరకూడదు సుమీ!'

బళ్ల చప్పుడు అవి దగ్గిర కొచ్చినట్టు సూచించింది.

నేను "రైట్!" అని ఓ చేతులో వెదురు కర్రా, మరోచేత్తో టార్చి పట్టుకొని రోడ్డు దగ్గిరి కొచ్చేను. ఎక్కడలేని ధైర్యం నన్నే ఆవహించింది.

"ఎవ్రరా ఆ బళ్లూ?" అన్నాను. గొంతుక కొద్దిగా వణికింది.

"మేం బాబూ; పంతులిగోరి తాలూకు."

"నిలబెట్టు."

"........హూ...హూ...హూ..... హూ—ఒరే యెంకా! సెగశ్శె! అప్పుడే తొంగున్నావట్రా?" అన్నాడు బండీవాడు. బళ్లు రెండూ ఆగాయి. నేను దగ్గిరిసా వళ్ళేను. టార్చి వెలిగించాను.

"ఏమిట్రా బళ్ళు?"

"గడ్డి బాబయ్యా!"

"రాత్రి తోల్తున్నారేం?"

"—ఏటి సెయ్యనం బాబూ; పెందిలి కాడొచ్చి పెద్ద పాలం సేను నూర్సాల వొలసకి గడ్డి దెమ్మని పెద్ద పంతులు కవురంపిండు; రాత్తిరిగాక పోతే పొగులెట్టా దొలేది?"

"అయితే గడ్డేనంటావ్."

"అగ్గిపెట్టుందా బాబు?"

"అగ్గిపెట్టె సంగతి తరవాత మూద్దాంలే." అంటూ బండీదగ్గిరగా వెళ్లి చేతులోవున్న కర్రతో బండిమీద ఉన్న గడ్డిని పొడిచాను కొంతవరకు బాగానే వెళ్లింది. అక్కడ గట్టిగా తగిలింది ఆశ్చర్యపడలేదు.

"ఏమిరా, గడ్డిగట్టిగా తగుల్తోంది?" అన్నాను; టార్చిని వాడి ముఖంమీదికి ఫోకస్ చేస్తూ.

"అయున్నీ మీ కెందుకండె హూ!" అన్నాడు వాడు చిరాగ్గా.

"కోప్పడుకురా బాబూ - అదుగో; జువ్వి చెట్టుకింద టీ. యస్. ఓ గారు నిలబడున్నారు. ఆ యనకను కొక్కమంటేను-;" అని టార్చి రామక్రిష్ణ మీదికి ఫోకస్ చేశాను.

అదృష్టవశాత్తు వాడు పోజు ఘనంగా పెట్టాడు. నేనూ వాడు టీ. యస్. ఓ వే అనుకుందును, తెలీకపోతే.

"ఏటి సేద్దు బాబూ! గడ్డి బళ్ళే."

"తగ్గరా!- పరవాలేదులే; నిజం చెప్పేయ్. అగడ్డి తీసి, బస్తాలు గాబోలు, నేల పడేసి పో."

"ఇఁ ఇఁ - బస్తాలేటి బాబూ; గడ్డి బల్లం తుంతే?"

"కబుర్లు చెప్పక పడెయ్యవోయ్!"

వెనక బండీవాడు అకస్మాత్తుగా కలగజేసుకుని "సెప్తుంటేటిది బాబూ!- గడ్డి బల్లండీ యంతుంతే యివ్వ; పడెయ్యి - ఎంతుకు బాబు!" అన్నాడు.

నేను స్నేహపూర్వరంతో - "ఒరే - గడ్డిబండే అయితే ఓమారు విప్పడానికి భయం దేనికి రా?" అన్నాను.

కొంచెంసేపటివరకూ ఎవరూ మాటాడలేదు. ఆనక మొదటి బండీవాడు "తమర్నెందుకు మభ్బెపెట్టాలగాని, పంతులుగోరి బత్తా వొకటుంది; అళ్లల్లోరింటికి పమ్మిస్తన్రు." అన్నాడు.

"ఒక్క బస్తావా?"

"అవును బాబూ."

"ఒరే - వేషాలు వేసేరంటే మీకూ మీ పంతులికీ కూడా అయిపోతుంది. చెప్పెయి ఆరా, అయిదా? ఎన్ని బస్తాలు?"

మొదటి బండీవాడు దిగి "యెంకా!' అన్నాడు. ఆ వెనక్కివెళ్ళి ఇద్దరూ గుసగుసలాడుకున్నారు. అదయిపోయాక నాదగ్గిర కొచ్చారు. మొదటి బండీవాడు "బాబూ; మరి తమర్తో యెందు కబద్ద మాడాల? నాలుగు బత్తాలున్నయి. ఇప్పుడు మల్లా పంతులు గోరిదగ్గిరి కెల్లలేం - ఇయిగో యీ అయిదు రూపాయల్లోనీ కటాచ్చించాల" అన్నాడు.

నేను ముక్కుమీద వేలు పెట్టుకుని "ఎంతపని? లంచ మిస్త్రారా ?-అక్కడెవరున్నారో చూసేరూ? టీ. యస్. ఓ గారు! లంచమంటే యింకేమున్నా వుందిరా?" అన్నాను మెల్లిగా.

వాళ్లిద్దరూ ఒకళ్ల తరవాత మరొకళ్లు బతిమాలారు. చివరికి యిరవై రూపాయలకి బేరం చేశాను. కాని వాళ్లదగ్గిర యిరవై లేవు. వెనకబండీవాడు ఊళ్ళోకెళ్లాడు. తిరిగొచ్చి "సరింగా సమయానికి పంతులు గోరింటికాడ సేరు. అబ్బాయి గారితో సెప్పినాను — ఇలా పెమాద మొచ్చీసినాది యిరవై కావాలంటుండారు అని. అరు తీసిచ్చినారు. ఇయిగో బాబు! నెక్కెట్టుకోండి.'' అన్నాడు - ఇరవై రూపాయలలా ఇస్తూ.

పాపం మళ్ళీ ఊళ్లోకి వెళ్ళడానికి కష్టపడ్డాడు గదా అని ఆ బండీ వాడికి అర్ధరూపాయిచ్చాను. తోటివాడని మొదటి బండీవాడికీ యిచ్చాను. వాళ్లు బళ్లు తోలుకుని వెళ్తున్నారు.

(31-వ పేజీ చూడండి)

# ఒక చీకటిరాత్రి

(10-వ పేజీ తరువాయి)

నాయుడు కౌనా పక్కనించి గబుక్కి వొస్తున్నాడు.

"అరిఫ్గాలా! నువ్విక్కడనక్కి వున్నావూ?" అన్నాను.

లేకపోతే తమురు నైటేస్తప్పుడు అల్లకి కనిపించనా?"

అందుకే రామక్రిష్ణమీదికి ఫోకస్ చేసినప్పుడు వీడు కనిపించలేదు. తెలివైనవాడే ఎలాగయితే నేం.

కాని వాడు ఎంత వుపకారం చేసినట్టు. ఇరవై రూపాయల బేరం చూపించాడు. వాడిది చాలా వుదారస్వభావంలా తోచింది నాకు. ఎంత ఇస్తే బాగుంటుంది?

వాణ్ణి ఆపక్కని నిలబెట్టి రామక్రిష్ణని అడిగాను. "ఏమిరా, వీడి కెంత యిద్దాం?"

"పందొమ్మిదున్నాయి కదూ! మూడిచ్చెయ్. ఎనిమిదేసివుంటాయి మనకి."

"ఒరే, యిస్తూ యిస్తూ మూడేమిట్రా — అయిదేనా లేకుండానా? నిజానికి వాడు మనకి ఎంత ఉపకారం చేసినట్టు?"

"అయిదిస్తే మనకి ఏడేసి అవుతాయి. కొడుతూ కొడుతూ ఏడేసేమిటి- ఏడున్నర వుంటుంది నాలుగిచ్చెయ్."

ఇదో మోస్తరుగా వుంది. నాయుడుని పిలిచి నాలుగు రూపాయలూ లెక్కబెట్టి యిచ్చేశాను.

రామక్రిష్ణగాడు తెగనవ్వుతున్నాడు. స్కూల్లో జీరోలూ, డిజిట్ మార్కులూ వొచ్చేవి నీకు. ఇంతటివాడి వెలా అయ్యావు అని అభినందిస్తున్నాడు.

ఒంటిగంటన్నరయ్యేసరికి బంగాళా చేరుకుంటున్నాం.

అప్పటికి వరండామీద లైటు వెలుగుతోంది. ఓకుర్చీమీద టీ. యస్. ఓ. గారూ మరోకుర్చీమీద పంతులుగారూ కూర్చున్నారు. ఇదేమిటి చెప్మా రాత్రి ఒంటిగంట దాటాక ఆరాత్తుగా టీ. యస్. ఓ గారు లేచికూచున్నారు. అని నేను ఆశ్చర్యపడుతున్నాను.

"ఏదో పనుండి పంతులుగారు లేపి వుంటార్రా" అన్నాడు రామక్రిష్ణ.

పంతులుగార్ని చూడగానే అకస్మాత్తుగా నాకో విషయం జ్ఞాపకానికొచ్చింది.

"ఒరే - పాపం పంతులుగారు సాయంత్రం సిగరెట్లు లేని ఆపత్సమయంలో మనకి సిగరెట్లిచ్చి వుపకారం చేస్తే ఆయన కిలా చేశాం; మనదేనురా, ధర్మమన్నప్పుడు!" అన్నాను.

"లేకపోతే యేమిటనుకున్నావురా!" అన్నాడు రామక్రిష్ణ ఇదంతా వాడిప్రతాపమే అయినట్టు. ఇంకా ఇలా అన్నాడు. "ఉపకారికి నపకారము నెపమెన్నక సేయువాడె నేర్పరి సుమతీ! అన్నాడు కలి ధర్మస్మృతిలో"

"ఆహా? ఈ కలి ధర్మాలూ, స్మృతులూ ఎవడిదగ్గిర నేర్చుకున్నావురా?" అని నేను గురుత్వంతో నవ్వాను.

టీ, యస్. ఓ గారు మామీద చాలా కోపంగా ఉన్నారు. "రండి రండి - మీకు ఘట్టిగా ఓ చురక వేస్తేనేగాని బుద్ధిరాదులా వుంది. నేను డి. యస్. ఓ. కి రాసేస్తాన్లెండి. ఇంతటి వాళ్ళయ్యారన్నమాట! మీకీ లంచంపుచ్చుకోడం ఎలా అలవాటయింది. వేషాలు వెయ్యదలుస్తున్నారే! ఇలా ఎందర్ని మోసం చేశారు. మీకు గూఢచారులు కొందరా? మీకేమన్నా బుద్ధులున్నాయా? తిన్నయింటికే వాసాలు లెక్కపెడుతున్నారే! లోగడ వొచ్చినప్పు డెవరింట్లో భోంచేశారో జ్ఞాపకం లేదేం, ఏమయ్యా యింతంత ఘోరాలకి తలపెట్టారు? ...... పోనీ ఏదో చేశారు. పంతులుగారు మంచివాళ్లే — పడెయ్యండి- ఎంత తీసుకున్నారు? ఇరవైట; ఆయిరవై ఇలాపడెయ్యండి." అన్నారు.

నాకు మీదప్రాణాలు మీదనే ఎగిరిపోయాయి.

పంతులుగారన్నారు "నేను మామూలుగా రామ్మందిరంలోకి పేకాటకి పోయాను. ఆ వెంకడొచ్చి అర్జంటుగా ఇరవైరూపాయలు కావాలి; ఇలా యిలా ప్రమాదం వొచ్చింది. టీ, యస్. ఓ. గారు బస్తాలు పట్టేసుకున్నారు. అని చెప్పేట్ట. పోనీ నాకు కబురేనా పంపేడుగాదు, తేల్చేద్దును. మన ఏర్పాటు వాడికేం తెలుసునూ, మా అబ్బాయి తీసిచ్చేసేడు."

"పోనీ ఇప్పుడు మించిపోయిందేమిటి? పడేయండోయి ఆ యిరవై. రూపాయలూ ఇలాగ!" అన్నారు టీ. యస్. ఓ. గారు.

టీ. యస్. ఓ. గారు సాయంకాలమే పంతులుగారిదగ్గిర ఓ పెద్ద మొత్తాన్ని "మామూళ్లు" గా తీసుకోవడమే నాకిప్పుడు ఆయనమీద చూపుతున్న అభిమానానికి కారణమని మాకేం తెలుసూ?

---

# క్యూ

(19-వ పేజీ తరువాయి)

మాటలు నడిచాయి. ఆ తరువాత మాటలకి, మాటలు బదులుపలికాయి. ఏదో అవ్యక్తానందాన్ని అనుభవించడంకోసమన్నట్లు, వారు మరికొంతకాలంతరువాత "క్యూ" నివిడిచిఎక్కడికో వెళ్ళిపోయినారు. అవ్యక్తానందాన్ని అనుభవించడం కోసం "క్యూ" ని వదిలివెళ్ళడం అవసరమేమోనని, నాకు తోచింది.........

మెదడు గిర్రున తిరిగింది...."క్యూ" రూపంలో ఆలోచనాపరంపరలు నా మెదడును చుట్టివేశాయి.....క్రమేణా ఈ ఆలోచనలు, ఒక నిర్దుష్టస్వరూపాన్ని పొందాయి......

చావుబ్రతుకులనుబట్టి చూస్తే, మానవులంతా, మానవమాత్రులుగా, ఒక "క్యూ" లో యిముడుతారు. ఒకరి తరువాత ఒకరు పుట్టడం, చివరకి గిట్టడం - దీనిని మానవమాత్రు డెవ్వడూ, ఇంతవరకు తప్పించుకోలేదు - "క్యూ" పద్ధతి అది మానవుడితో పుట్టింది - మానవప్రళయంతో అంతమొందుతుంది.

ప్రపంచమంతా "క్యూ"ల మయం. ఇందులో కొన్ని సహజమైనవీ, మరికొన్ని కృత్రిమమైనవి —

ఆదికవి వాల్మీకి కవుల "క్యూ"లో మొదటివాడు - ఈ "క్యూ" ఇంకా అంతం కాలేదు - కవిత్వం చచ్చి వూరుకున్ననాడు అంతమొందుతుంది. ఇదేవిధంగా, సంఘసంస్కర్తలది ఒక క్యూ - విజ్ఞానశాస్త్రవేత్తలది మరొక "క్యూ".

మానవమాత్రులు ఈ క్యూలని తప్పించుకోలేరు - సహజాసహజప్రసక్తి అటుంచి మరలు యంత్రంలో యిమిడినట్లే వారు ఏదో ఒక "క్యూ"లో యిమడక తప్పదు -

సహజమైన "క్యూ"లు ప్రగతిని ఆహ్వానిస్తాయి-మానవాభ్యుదయానికి సుస్వాగతం చెబుతాయి - మానవునిలో, క్లిష్టపరిస్థితుల్ని అధిగమించే శక్తినీ, ఉత్సాహాన్ని జాగరితం చేస్తాయి.

చీకటిబజారువర్తకులు, మతగురువులు, బూటకపు రాజకీయవేత్తలు, దోపిడిదారులు, హంతకులు, కృత్రిమమైన "క్యూ"లు ఏర్పరుచ్చుకొని మానవాభ్యుదయానికి హానికరంగా పరిణమిస్తున్నారు - బ్రాహ్మణులూ, రెడ్లూ, హరిజనులూ మొదలైన కృత్రిమమైన గోడల్ని నిలబెట్టి, సోదరమానవులమధ్య చీలికల్ని ఏర్పరుస్తున్నారు. ఈ కృత్రిమమైన "క్యూ"లు ఆమూలాగ్రంగా నశించడం అవసరమని నాకు తోచింది. వాటిని మూలచ్ఛేదం చేయడం మానవధర్మమని, హృదయం హోరెత్తింది. ఆ అదృష్టం మనకి ఏనాటికైనా పడుతుందా? "ఏమోనని" ప్రస్తుతం నా హృదయం నిరాశతో మూల్గుతున్నది.......